కబడ్డీ మహిళా జట్టు ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: సౌత్ జోన్ మహిళల కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను జేఎన్‌టీయూహెచ్‌లో యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ అరుణకుమారి, డీఈ, చీఫ్ సెలక్టర్ డాక్టర్ సోమేశ్వర్, హ్యాండ్ బాల్ జాతీయ క్రీడాకారులు కుమార్ యాదవ్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఈ సెలక్షన్‌లో వివిధ కళాశాలల నుంచి దాదాపు 90 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారు అలగప్ప యూనివర్సిటీ, చెన్నైలో నవంబర్ 20 నుంచి 25 వరకు జరిగే సౌత్‌జోన్ పోటీలలో ఆడనున్నారని స్పోర్ట్స్ సెక్రటరీ ఎస్ఎస్ దిలీప్ తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

థియేటర్ కార్మికులకు బోనస్ ఇవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న థియేటర్ల కార్మికులు

కూకట్‌పల్లి: దీపావళి పండుగలోగా సినిమా థియేటర్‌లలో పనిచేసే ప్రతి కార్మికునికి బోనస్ చెల్లించాలని తెలంగాణ సినిమా థియేటర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పలు థియేటర్ల వద్ద నిరసన తెలిపి సమావేశంలో మాట్లాడారు. పీవీఆర్ ఐనాక్స్, ఏషియన్ సినిమాస్, మిరాజ్ మల్టీప్లెక్స్, సినీ పోలీస్ మల్టీప్లెక్స్, మూవీ టైం సినిమాస్, సింగిల్ థియేటర్స్‌లలో బోనస్‌లు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోనస్ చెల్లించడానికి లాభనష్టాలకు సంబంధమేలేదన్నారు. నష్టాల్లో ఉన్నా కార్మికులకు బోనస్ చెల్లించాలని చట్టంలో ఉందని ఆయన గుర్తు చేశారు. బోనస్ ఇవ్వని థియేటర్లు ఎదుట దీపావళి తర్వాత పెద్ద ఎత్తున కార్మికులను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మారన్న, అరుణ్, పుల్లారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్త సభ్యత్వం చేయించాలి

మోతీనగర్: ప్రతి బీజేపీ కార్యకర్త 100 సభ్యత్వాలు తప్పనిసరిగా చేయించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి సద్గుణరెడ్డి అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ చౌరస్తాలో బీజేపీ పూర్వ మోతీనగర్ డివిజన్ అధ్యక్షుడు డి. రాంగోపాల్ సింగ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీ జెండా తెలంగాణలో ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వెంకట రామిరెడ్డి, సందీప్ సింగ్, గోనెల సుదర్శన్, నార్లపురం శ్రీనివాస్, జలంధర్, నవీన్, శ్రీనివాస్, రాజు, రంజిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సద్గుణ రెడ్డి, నాయకులు

ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని ఆత్మహత్య

కేపీహెచ్‌బీ కాలనీ : ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఓ వ్యక్తి సిలింగ్ ఫ్యాన్ కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు జిల్లాకు చెందిన కంద్ర కమలాకర్ (30) బ్రతుకు దెరువు కోసం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీ కాలని టెంపుల్ బస్టాప్ ప్రాంతంలోని ఎల్ఐజీ 462 లో అద్దెకు ఉంటున్నాడు. ఉద్యోగం కోసం వెతుకుతూ మరో ముగ్గురితో కలిసి గదిలో అద్దెకు ఉంటున్న కమలాకర్ ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం గదిలో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి రూమ్మేంట్స్ వచ్చి చూసేసరికి కమలాకర్ ఉరేసుకొని ఉండే సరికి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కమలాకర్ కుటుంబసభ్యులకు సమాచారం అందించి దర్యాప్తు చేస్తున్నారు.

క్రాకర్స్ షాపులో తనిఖీలు

మూసాపేట: మూసాపేటలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మూసాపేట సర్కిల్ ఏఎంహెచ్ఓ కార్తిక్ క్రాకర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. మూసాపేట, కైత్లాపూర్, సేవాలాల్ నగర్‌లోని పలు దుకాణాల లైసెన్స్, భద్రతలను పరిశీలించారు. నాణ్యత లేని వాటిని నీటిలో తడిపి కైత్లాపూర్‌లోని డంపింగ్ యార్డుకు తరలించారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.



తనిఖీ చేస్తున్న ఏఎంహెచ్ఓ కార్తిక్

జిల్లాలో 29.40 లక్షల ఓటర్లు

సాక్షి,సిటీబ్యూరో: ఎన్నికల సంఘం మంగళవారం ఓటరు జాబితాను విడుదల చేసింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఓటర్లు 29,40,923 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 15,13,910 మంది, మహిళా ఓటర్లు 14,26,612 మంది, ట్రాన్ జెండర్ ఓటర్లు 401 మంది ఉన్నారు. ఎన్ఆర్ఐ ఓటర్లు 725 మంది, సరీస్ ఓటర్లు 735 మంది ఉన్నారు.



పండగ వేళ.. మార్కెట్లు కళ కళ

దీపావళి సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్లో సందడి నెలకొంది. వాడవాడలా వెలిసిన షాపులల్లో ప్రజలు కొనుగోలు చేస్తూ సందడిగా కనిపించారు. మూసాపేట, భరత్‌నగర్, ఆంజనేయనగర్, కూకట్‌పల్లి, వై జంక్షన్, కేపీహెచ్‌బీ, భాగ్యనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ, మోతీనగర్‌లలో వివిధ డిస్కౌంట్‌లతో దుకాణాదారులు ఆకట్టుకుంటున్నారు. టపాసులు, ప్రమిదలు, గృహాలంకరణ వస్తువుల అమ్మకాలు జోరందుకున్నాయి. అదేవిధంగా వ్యాపార సముదాయాల అలంకరణకు ఉపయోగించే వివిధ రకాల పూలతో మార్కెట్లు కళకళలాడాయి. బుధ, గురువారాల్లో విక్రయాలు పెరుగుతాయని వ్యాపారులు అంటున్నారు.

– మూసాపేట

















పార్కులో సౌకర్యాలు కల్పించాలి



పార్కును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు 3వ ఫేజ్ పార్కులో సౌకర్యాలు కల్పించాలని, పార్కు ఆవరణను శుభ్రంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు శివచౌదరి, బచ్చు మల్లి అన్నారు. మంగళవారం పార్కును పరిశీలించారు. పార్కులో ఉన్న మట్టికుప్పలు, విరిగిపోయిన చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. మెయింటెనెన్స్ టీమ్‌కు రావాల్సిన పెండింగ్ బకాయిలను అధికారులతో మాట్లాడి వచ్చేలా కృషి చేస్తామన్నారు.

రేపు రన్ ఫర్ యూనిటీ ర్యాలీ

కూకట్‌పల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా గురువారం రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపేట్ పటేల్ విగ్రహం నుంచి కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

మెగా జాబ్‌మేళా



జాబ్ మేళాను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మూసాపేట: మూసాపేట వార్డు కార్యాలయంలో మంగళవారం మ్యాజిక్ బస్సు ఫౌండేషన్, మూసాపేట వీర్ సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 25 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొని 466 మంది నిరుద్యోగులకు గాను 80 మందిని ఎంపిక చేశాయి. కార్యక్రమంలో మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ హైదరాబాద్ ఇన్‌చార్జి ప్రేమ్, మహేందర్, వీర్ సావర్కర్ సేవా సమితి అధ్యక్షులు సంతోష్, విశాల్, తేజ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకరరావు, నాయకులు మల్లేష్‌గౌడ్, డాకయ్య, డేటా సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి విజయ భవాని, తూము శైలేష్, రవిగౌడ్, నాయకులు సాయి, క్రాంతి, నిశ్చల్, రాజేశ్వరి, కార్తిక్, తిరుపతి, జిల్లా మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌నగర్ హిందూ శ్మశాన వాటికలో కార్పొరేటర్ సబిహా బేగం జీహెచ్ఎంసీ ఏఈ రంజిత్‌తో కలిసి రూ.78 లక్షల వ్యయంతో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో శ్మశాన వాటికలో బోర్‌వెల్, పూజా గది, వాచ్‌మెన్ గది, బాత్‌రూం, అస్తికల గది, కట్టెల గది ఇతర అధునాతన వసతులతో కూడిన అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు.

ధన్వంతరి నారాయణమూర్తి జయంతి వేడుకలు



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి నారాయణ మూర్తి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పన్నాడి రమేష్ మాట్లాడుతూ.. ఆయుర్వేదం ఎంతో అమృతం లాంటిది అని అన్నారు. గతంలో ఆయుర్వేదానికి ఎంతో ప్రాధాన్యం ఉండేదని గుర్తు చేశారు. కార్యక్రమంలో నరసింహ, సెక్రటరీ తాటిపాముల వెంకటేష్, సతీష్, వార్డు మెంబర్ కృష్ణ, మహేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహరి నగర్‌లో రోడ్డు పరిశీలన

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరి నగర్‌లో రోడ్డును మాజీ కార్పొరేటర్ బాబూరావు మంగళవారం పరిశీలించారు. రోడ్డు నిర్మించాలని స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన పర్యటించారు. అనంతరం ప్రగతి నగర్‌లోని రోడ్డును, సీనియర్ సిటిజన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సత్తయ్య, అనిల్, వెంకటేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు

– ఆల్విన్‌కాలనీ

డబుల్ ఇళ్ల పేరిట మోసం

- రూ.40 లక్షలకు పైగా వసూలు చేసి పరార్
- ఎమ్మెల్యే చొరవతో కేసు నమోదు



మోసపోయిన విషయాన్ని ఎమ్మెల్యేకు వివరిస్తున్న బాధిత మహిళలు

కేపీహెచ్‌బీకాలనీ: డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానంటూ మహిళలను నమ్మించి సుమారు రూ.40 లక్షల వరకు వసూలు చేసి ఉడాయించాడు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత మహిళలు కేపీహెచ్‌బీ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం.. బోయినపల్లి అల్వాల్ ప్రాంతంలో నివాసం ఉండే వేణుగోపాల్ దాస్ అనే వ్యక్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించేపై అధికారి వద్ద పని చేస్తానని, ఇళ్లు కావాల్సిన వారికి ఇప్పిస్తానని నమ్మ బలికాడు. సొంతింటి కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని దుండిగల్ ప్రాంతంలోని ఇళ్ల వద్దకు తీసుకువెళ్లి చూపించాడు. ఒక్కో ఇంటికి రూ.2.50 లక్షలు ఇస్తే ఇంటి తాళాన్ని కూడా అందజేస్తానని చెప్పాడు. దీంతో బోయినపల్లికి చెందిన లక్ష్మి అనే మహిళ నమ్మి డబ్బులు ఇచ్చింది. అంతేకాకుండా హౌసింగ్‌బోర్డు కాలనీలో తాను పనిచేసే షాపులోని మహిళలకు కూడా సదరు విషయం చెప్పింది. ఆన్‌లైన్ ద్వారా కొంత నగదు రూపంలో చెల్లించారు. వారికి నకిలీ ఇళ్ల కేటాయింపు లెటర్, ఇంటి తాళాన్ని ఇచ్చాడు. ఈ విధంగా కేపీహెచ్‌బీ కాలనీ ప్రాంతానికి చెందిన 15 మంది మహిళలు, బోయినపల్లి ప్రాంతానికి చెందిన మరికొందరు మహిళలు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు చెల్లించారు.పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఇళ్లల్లోకి గృహ ప్రవేశాలు చేసుకోవచ్చని నమ్మించి డబ్బులు తీసుకొని ఉడాయించాడు. ఇళ్ల పత్రాలు తీసుకున్న వారంతా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దగ్గరికి వెళ్లి చూస్తే అసలైన లబ్ధిదారులు ఇళ్లలో ఉండటంతో మోసపోయామనే విషయాన్ని గ్రహించారు. డబ్బులు తీసుకున్న వేణుగోపాల్ దాస్ కనిపించకపోవడంతో ఏడ్చుకుంటూ మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వద్దకు వెళ్లారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దీంతో బాధిత మహిళలు కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గుచేటు

- అక్రమ కేసులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి
- రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌దే అధికారం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షపూరితంగా వ్యవహరించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఫతేనగర్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సమస్యలు, పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికి వదిలేశారని, నిధులు లేక పురపాలికలు దిక్కులు చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నిధుల లేమితో నేడు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై నాయకులు, కార్యకర్తలు దృష్టి పెట్టాలన్నారు. వీధి దీపాల సమస్యలు మొదలుకొని అన్నీ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం మరింత కక్షపూరితంగా వ్యవహరించడంతో పాటు అక్రమంగా కేసులు కూడా నమోదు చేసి బీఆర్ఎస్ పార్టీని మరింత ఇబ్బందులకు గురి చేయవచ్చని, వాటిని ఎదుర్కొనేందుకు అందరం సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, నాయకులు భిక్షపతి, రాములు, ఎస్. సుదర్శన్‌రెడ్డి, కన్నయ్య, బాలకృష్ణ, శశి, నందకుమార్, శంకర్ గౌడ్, సలావుద్దీన్, గౌస్, కె. రాము, రాజకుమార్, సతీష్, శిల్ప, కృష్ణ కుమారి, బేగం, రహిమ, బాలమణి, జ్యోతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పనుల పరిశీలన

మూసాపేట డివిజన్ పరిధిలోని రామారావునగర్, కబీర్ నగర్ ప్రాంతాల్లో నాలా పనులు పురోగతిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. మురుగు నీటి నాలా పరిస్థితిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను సత్వరం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ రంజిత్, వాటర్ వర్క్స్ మేనేజర్ విలియం ప్రకాష్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారిణి ప్రభావతి, నాయకులు తూము శ్రావణ్ కుమార్, సత్యనారాయణ, అంబటి శ్రీనివాస్, సత్యం, తిరుపతి, వినోద్, జోసెఫ్, బోడ శ్రీనివాస్, మజీద్ తదితరులు పాల్గొన్నారు.



నాలా పనుల పురోగతిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే